క్లుప్తంగా

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి సుధాకర్ కోరారు. స్థానిక నరసింహయ్య భవన్‌లో మంగళవారం సంఘం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. రైతు భరోసా, పీఎం కిసాన్ అందించడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన సందర్భాల్లో కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ ప్రభుత్వ సాయం అందేలా చూడాలన్నారు. సంఘం జిల్లా కమిటీ సభ్యులు మార్కు, సోమన్న, నరసింహులు, ఏలియా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోండి


పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ స్వప్నికారెడ్డి

నంద్యాల(అర్బన్): రబీలో పంటలు సాగుచేసిన రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని నంద్యాల మండల వ్యవసాయాధికారి స్వప్నికా రెడ్డి సూచించారు. మండలంలోని పెద్దకొట్టాల గ్రామంలో ఆమె మంగళవారం పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులు పంట నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వ సాయం అందుతుందన్నారు. నమోదు చేయించుకోని రైతులకు ప్రభుత్వం నుంచి ఏ విధమైన సాయం అందని స్పష్టం చేశారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి


ముఖ ఆధారిత హాజరు నమోదు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నంద్యాల(సిటీ): మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందికి ఫేసియల్ రికగ్నిషన్ ద్వారా హాజరు ప్రతి రోజూ నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆదేశించారు. ఆయన మంగళవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫేసియల్ రికగ్నిషన్ హాజరును మున్సిపల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు 215 మంది, అవుట్ సోర్స్ ఉద్యోగులు 584 మంది తప్పనిసరిగా ప్రతిరోజూ నమోదు చేయాలన్నారు. అలాగే పబ్లిక్ హెల్త్, నాన్ పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంటు వారు కూడా ఈ ప్రక్రియను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇందుకోసం మున్సిపల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

'ఖిద్మత్' సేవలు అభినందనీయం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఖిద్మత్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్డీ రహిత రుణాల పంపిణీ అభినందనీయమని జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు అబ్దుల్‌సమ్మద్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో సొసైటీ సభ్యులకు రూ.1.25 లక్షలు వడ్డీ రహిత రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు నవాజ్‌ఖాన్ మాట్లాడుతూ సొసైటీ ప్రారంభమై నాలుగు నెలల్లో రూ.2 కోట్లు లావాదేవీలు నిర్వహించారు. 30 మందికి రూ.9 లక్షలు వడ్డీ రహిత రుణాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. సుహేల్‌రాణా, అఫీజ్ మహబూబ్‌బాషా, అబ్దుల్లా, అబ్దుల్‌కరీమ్, నూరుల్‌హక్, ఫయాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు శాప్ ఫుట్‌బాల్ లీగ్ ప్రారంభం

నంద్యాల(సిటీ): పట్టణంలోని ఎస్పీజీ మైదానంలో ఈ నెల 18న శాప్ ఫుట్‌బాల్ లీగ్ రాష్ట్రస్థాయి ఫేజ్–2 పోటీలు ప్రారంభం కానున్నాయని క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్, క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో పురుషుల లీగ్ పోటీలు జరుగుతాయన్నారు. దాదాపు 20 రాష్ట్రస్థాయి జట్లు పాల్గొననున్నట్లు వెల్లడించారు.

ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయండి

నంద్యాల(అర్బన్): రైతులు పండించిన అన్ని రకాల పంటలకు మద్దతు ధరల చట్టం అమలు చేయాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో ఈనెల 26న నంద్యాలలో చేపట్టనున్న ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, అధ్యక్షులు రమేష్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. స్థానిక నరసింహయ్య భవన్‌లో మంగళవారం వారు మాట్లాడుతూ.. గతంలో ఢిల్లీలో రైతాంగ పోరాటంలో ప్రధాని నరేంద్ర మోదీ రైతులకు ఇచ్చిన లిఖిత పూర్వక హామీలను అమలు చేయాలని కోరుతూ మరోమారు దేశ వ్యాప్త ఉద్యమంలో భాగంగా జనవరి 26 నుంచి ఏప్రిల్ 5 వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, సుధాకర్, శంకర్, సంటెన్న, రామచంద్రుడు పాల్గొన్నారు.

ఆశల శనగ

- ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 49,993 ఎకరాల్లో సాగు
- పంటను చూసి మురిసిపోతున్న రైతన్నలు
- ఎకరానికి 7 బస్తాలకు పైగా దిగుబడులు వచ్చే అవకాశం

మండలాల వారీగా శనగ పంట సాగు విస్తీర్ణం

మండలం	ఎకరాలు
ఉయ్యాలవాడ	30,612
దొర్నిపాడు	11,280
ఆళ్లగడ్డ	3,152
చాగలమర్రి	4,712
రుద్రవరం	237
శిరివెళ్ల	--


ఉయ్యాలవాడ సమీపంలో కాయ దశలో ఉన్న శనగ పంట

ఉయ్యాలవాడ: ఈ ఏడాది రబీ సాగు అన్నదాతలకు ఆశలు రేకెత్తిస్తోంది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో వర్షాధారం కింద పప్పు శనగ 49,993 ఎకరాల్లో మాత్ర పంటగా రైతులు సాగు చేశారు. గతేడాది అక్టోబర్ ప్రారంభంలో భూమి పదునయ్యేలా వర్షం కురిసింది. ఆ నెల చివరి వారంలో విత్తనం వేశారు. రసాయన ఎరువులు, విత్తనాలు, క్రిమీ సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు వెచ్చించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధికంగా ఉయ్యాలవాడ మండలంలో 30,612 ఎకరాల్లో పంట సాగైంది. జెజె–11 రకం ఎర్రశనగ సాగు విస్తీర్ణం తగ్గింది. పూలేజీ, కాబోలు రకాలు (తెల్ల శనగ) ఎక్కువ శాతం రైతులు సాగు చేశారు. పొలాల్లో ఎక్కడ చూసినా శనగ పంట ఏపుగా పెరిగి చెట్టు నిండ పూత, కాయలు ఉండడంతో అన్నదాతలు ఆనందంతో ఉన్నారు. మరో 20 రోజుల్లో పంట దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. ఎకరానికి 7 బస్తాలకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. ప్రస్తుతం తెల్ల శనగ ధర మార్కెట్‌లో క్వింటాలుకు రూ.7 వేల నుంచి రూ.7,500 వరకు ఉంది. ఎర్రశనగ క్వింటా రూ.4,700లోపు ధర పలుకుతోంది. దిగుబడులు వచ్చే వరకు ధర నిలకడగా ఉంటే తెల్ల శనగ రైతుకు గిట్టుబాటు అవుతుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

40 ఎకరాల్లో తెల్ల శనగ సాగు చేశా



నాకున్న 50 ఎకరాల్లో 40 ఎకరాల్లో తెల్ల శనగ సాగు చేశాను. ప్రస్తుతం పంట బాగుంది. ఎకరానికి 7 బస్తాలకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. గతేడాది ఎకరాకు 10 బస్తాలు దిగుబడులు వచ్చాయి. దిగుబడి తగ్గినా మార్కెట్‌లో ధర నిలకడగా ఉంటే రైతులకు ఎలాంటి నష్టం ఉండదు. – కుమ్మరి గురప్ప, రైతు, ఉయ్యాలవాడ

పైరును చూస్తే ఆనందంగా ఉంది



ఈ ఏడాది శనగ పైరును చూస్తుంటే ఆనందంగా ఉంది. నేను 10 ఎకరాల్లో ఎర్ర శనగ సాగు చేశాను. క్వింటా రూ.4,500 నుండి రూ. 4,700 వరకు ధర ఉంది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి క్వింటా రూ. 6 వేలతో కొనుగోలు చేస్తే రైతులకు ఊరట కలుగుతుంది. – శింగిరెడ్డి దివాకర్‌రెడ్డి, రైతు, తుడుమలదిన్నె

తగ్గిన సాగు విస్తీర్ణం



ఈ సారి శనగ పంట సాగు విస్తీర్ణం తగ్గింది. 30 ఏళ్లుగా మండలంలో రబీలో శనగ అధికంగా సాగవుతోంది. పంటకు వైరస్ తెగుళ్లు సోకుతుండడంతో కొంత మంది ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపుతున్నారు. గతేడాది 37 వేల ఎకరాల్లో శనగ పంట సాగుకాగా ఈ ఏడాది దాదాపు 6 వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గింది. ఈ సారి శనగ పంటకు వాతావరణం బాగా అనుకూలించింది. –రాజేంద్రకుమార్, వ్యవసాయాధికారి, ఉయ్యాలవాడ

రబీ పంటలకు సాగునీరివ్వండి


తెలుగుగంగ ఎస్‌ఈ వెంకటరమణతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు మూడు నెలల పాటు సమృద్ధిగా సాగు నీరు అందిచాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలుగుగంగ అధికారులను కోరారు. నియోజకవర్గంలో ప్రధాన సాగునీటి వనరు అయిన తెలుగుగంగ కాల్వల్లో సక్రమంగా నీరు పారడం లేదని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే మంగళవారం నంద్యాలలోని తెలుగుగంగ ప్రాజెక్ట్ కార్యాలయం చేరుకుని అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గంలోని రుద్రవరం, శిరివెళ్ల, చాగలమర్రి, ఆళ్లగడ్డ మండలాల్లో తెలుగుగంగ నీటిని నమ్ముకుని పంటలు సాగుచేసిన రైతులు నీరు సక్రమంగా పారకపోవడంతో ఆందోళన చెందుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని 13వ బ్లాక్ నుంచి 37వ బ్లాక్ వరకు నీరు విడుదల చేయాలని సూచించారు. దీనిపై స్పందించిన తెలుగుగంగ ప్రాజెక్ట్ ఎస్‌ఈ వెంకటరమణ ఎమ్మెల్యే సమక్షంలో అధికారులతో చర్చించిన అనంతరం రెండు రోజుల్లో సమృద్ధిగా సాగునీరు విడుదల చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

అహోబిలేశుడి పార్వేట మహోత్సవం


బాచేపల్లిలో ఉత్సవ పల్లకీని ఊరేగిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి పార్వేట మహోత్సవాల్లో భాగంగా గ్రామగ్రామాన విశేష పూజలందుకునేందుకు కొండ దిగిన ఉత్సవ పల్లకీ మంగళవారం బాచేపల్లి గ్రామం చేరింది. అహోబిలం నుంచి సోమవారం అర్ధరాత్రి శ్రీ ప్రహ్లాదవరదస్వామి, శ్రీ జ్వాలా నరసింహ స్వాములు కొలువైన ఉత్సవ పల్లకీ బాచేపల్లికి చేరుకోవడంతో గ్రామ ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి విశేష పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పల్లకీని భుజాలపై మోసుకుంటూ భక్తిని చాటుకున్నారు. అర్చకులు కల్యాణం, నరసింహ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు

ఉత్సవ పల్లకీని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి బాచేపల్లి గ్రామం చేరుకుని ఉత్సవ పల్లకీని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వచనాలు అందుకున్నారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. గ్రామ పొలిమేర నుంచి పూల వర్షం కురిపిస్తు ఆహ్వానించారు. ఈయన వెంట ఎంపీపీలు గజ్జల రాఘవేంద్రారెడ్డి, వీరభద్రుడు, ఎంపీటీసీ నాగేశ్వరరావు, నరసింహారెడ్డి ఉన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన


రుద్రవరంలో మామిడి రైతులకు పూత, పిందె సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రుద్రవరం: మామిడి తోటల్లో సకాలంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన శాఖ అధికారి నరేషరెడ్డి రైతులకు సూచించారు. రుద్రవరానికి సమీపాన ఉన్న మామిడి తోటల్లో మంగళవారం ఆయన రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మామిడిలో ఏటా డిసెంబరు నుంచి మొదలై ఫిబ్రవరి నెల వరకు పూత వస్తుందన్నారు. పూత మొదలు కాయ కోత వరకు తగిన జాగ్రత్తలు పాటించాలని అవసరమైన వరకే మందులు పిచికారీ చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని వివరించారు.

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం


మాట్లాడుతున్న సీఐ చంద్రబాబునాయుడు

శిరివెళ్ల: రోడ్డు ప్రమాదాలను నివారిద్దామని సీఐ చంద్రబాబునాయుడు అన్నారు. మంగళవారం రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై ఆటోడ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా చర్యలకు అందరు సహకరించాలన్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చే ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, మైనర్ల డ్రైవింగ్ చట్ట విరుద్ధమన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, అతివేగం ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం ద్వారా గమ్యం చేరుకోవాలని సూచించారు. ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన సేవ


అష్టాదళ పాద పద్మారాధన సేవలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ల వద్ద పటిష్ట బందోబస్తు


సిద్ధేశ్వరం ఘాట్‌ను సందర్శిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

కొత్తపల్లి: తెలంగాణ రాష్ట్రంలోని సింగోటంలో జాతర ముగిసే వరకూ కృష్ణానది తీరంలో ఘాట్ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆత్మకూరు సీఐ ఆర్‌జీ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని సంగమేశ్వరం, సిద్ధేశ్వరం, జానాలగూడెం ఘాట్లను మంగళవారం తన సిబ్బందితో కలసి సందర్శించారు. జాతరకు ఎవరైనా మరబోట్లు తిప్పుతున్నారా అని బందోబస్తు పెట్టిన పోలీసు, రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సింగోటం జాతరకు కృష్ణానదిపై మరబోటు, తెప్పలపై ప్రయాణాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిషేధించామన్నారు. జాతరకు వెళ్లదలచిన భక్తుల సౌకర్యార్థం ఆత్మకూరు ఆర్టీసీ డిపో వారు బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను ఉల్లంఘించి బోట్లు, తెప్పలను నడిపిన వారిపైన, అందులో ప్రయాణం చేసిన ప్రయాణికులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్‌ఐ రామ్‌నాథ్, వీఆర్వోలు అశోక్, రామసుబ్బలు ఉన్నారు.

విభజన హామీల అమలులో కేంద్రం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న జాన్సన్‌బాబు

నంద్యాల(అర్బన్): రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకై రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 22 నుంచి ఫిబ్రవరి 4 వరకు చేపట్టే సమర యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం నంద్యాల వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్సన్‌బాబు మాట్లాడుతూ.. రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. 5 కోట్ల ఆంధ్రుల హక్కు అయిన ప్రత్యేక హోదాను విస్మరించడం దుర్మార్గమన్నారు. సమస్యల సాధనకు అన్ని సంఘాల ప్రతినిధులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, ధనుంజయుడు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫీ, నిరంజన్, ఆది, ఎర్రిస్వామి, ప్రతాప్, మహానంది, ఉదయ్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

విరగ్గాసిన కంది


భాగ్యనగరం కేసీ కాలువ గట్టుపై విరగ్గాసిన కంది

దొర్నిపాడు: వరి పొలాల గట్లు, కేసీ కెనాల్ సబ్‌చానల్ వెంట కంది మొక్కలకు గుత్తులు గుత్తులుగా కాయలు కాశాయి. దీంతో రైతులు తమకు కందిపప్పుకు కొదవ ఉండదని హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దొర్నిపాడు, రామచంద్రాపురం, కొండాపురం, భాగ్యగనగరం, అమ్మిరెడ్డి నగరం, వెంకటేశ్వరనగరం, బుర్రారెడ్డిపల్లె తదితర గ్రామాల్లోని రైతులు గృహ అవసరాల కోసం పొలం గట్లపై కంది విత్తనాలు చల్లారు. ప్రస్తుతం ఆ మొక్కలకు కాయలు విరగ్గాయడంతో సంబర పడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో నాణ్యమైన కందిపప్పు ధర కిలో రూ.150 వరకు ఉంది.

గడ్డివాముల దగ్ధం

మహానంది: అగ్నిప్రమాదంలో గడ్డివాములు దగ్ధమైన ఘటన మంగళవారం బొల్లవరం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కంతా వెంకటేశ్వర్లు పశువుల కోసం నిల్వ ఉంచుకున్న గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని కాలిబూడిదయ్యాయి. అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న నంద్యాల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ. 30వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ సమస్యలపై ప్రజాభిప్రాయ సేకరణ


మాట్లాడుతున్న రమణారెడ్డి

నంద్యాల(రూరల్): ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు విద్యుత్ వార్షిక ఆదాయ అవసరాలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు నంద్యాల జిల్లా విద్యుత్ శాఖ అధికారి రమణారెడ్డి మంగళవారం తెలిపారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 19, 20, 21వ తేదీల్లో నిర్వహించే బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ రిటైల్ ధరలపై అపోహలు కలిగిన వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. స్థానిక నంద్యాల విద్యుత్ జిల్లా కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని తెలిపారు. ఏడీఈలు ఆంథోనిరాజు, సతీష్‌కుమార్ రెడ్డి, సుబ్బారావు, ఏఈ రామయ్యలు పాల్గొన్నారు.

గోడౌన్ నిర్మాణానికి భూమి పూజ



గోస్పాడు: సొసైటీకి మంజూరు చేసిన గోడౌన్ నిర్మాణానికి మంగళవారం స్థానిక సొసైటీ చైర్మన్ రామసుబ్బారెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యాళ్లూరులో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ గోడౌన్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. నాబార్డు నిధుల కింద రూ.75 లక్షలతో గోడౌన్ నిర్మించనున్నట్లు తెలిపారు. 1000 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే సామర్థ్యంతో గోడౌన్ నిర్మించనున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో గిరిజన సంక్షేమం భేష్


శంకర్ నాయక్‌ను కలిసిన గిరిజన సంఘాల నాయకులు

వెలుగోడు: రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల కోసం, ప్రత్యేకంగా బలహీన సమూహాల అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ కితాబిచ్చారు. నంద్యాల జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం వెలుగోడు పట్టణానికి విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల కోసం ప్రత్యేకంగా వైద్య, విద్య, రోడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని చెప్పారు. గిరిజన ప్రాంతాలలో అక్షరాస్యత పెంచి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఎస్టీ కమిషన్ సభ్యుడిని గిరిజన ప్రజా సమాఖ్య నాయకులు రాజు నాయక్, రవి నాయక్, బాలు నాయక్, మల్లేష్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడావత్ శంకర్ నాయక్, గిరిజన ప్రజా సమాఖ్య శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాము నాయక్, వైఎస్సార్‌సీపీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్, టౌన్ ప్రధాన కార్యదర్శి నీలా నాయక్, నాయకులు నాగేష్ నాయక్, సురేష్ నాయక్, అశోక్ నాయక్, టీచర్ నాగ స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఇ.పి.నెం:168/2019 ఇన్ ఓ.యస్.నెం. 234/2017
చాకలి చిన్న రాముడు --- డి.హెచ్.ఆర్
VS
సిద్దిరెడ్డి బాల నాగిరెడ్డి .... జె.డి.ఆర్

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా! డి.హెచ్.ఆర్ తనకు రావలసిన అమలు అర్జీ మొత్తం రాబట్టుకొనుటకు జె.డి.ఆర్ పైన అమలు అర్జీ దాఖలు చేసి షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు ద్వారా బహిరంగ వేలం వేయుటకు అమలు అర్జీ దాఖలు చేసియున్నాడు. షెడ్యూలు దాఖలా ఆస్తిని తేది : 06-02-2023 ఉదయం 10-30 గంటలకు పై కోర్టు ఎదుట వేలం వేయుటకు నిర్ణయించియున్నారు. కావున సదరు వేలం విషయంలో జెడిఆర్ అయిన మీకు ఏమైనా అక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు ఎదుట 06-02-2023వ తేది ఉదయం 10-30 గంటలకు హాజరై మీ యొక్క అక్షేపణలు తెలుపుకొనవలసినదిగా తెలియజేయడమైనది. లేనంతట మీ పరోక్షమందు షెడ్యూలు దాఖలా ఆస్తులు వేలం వేయబడునని తెలియజేయడమైనది.

షెడ్యూలు : నంద్యాల జిల్లా నంద్యాల రి.డి బండిఆత్మకూరు సబ్.డి.లో చేరిన గడివేముల మండలం, కొరటమద్ది గ్రామంలోని భూమికి సెంబరు వారి వివరం :
1) సర్వే నెం. 203/1 విస్తీర్ణం : 2-69 సెంట్లు
దిశలు : తూర్పు : నాగేశ్వర రెడ్డి గారి భూమి, పడమర : కాల్వ, ఉత్తరం : వై. చిన్నలక్ష్మిరెడ్డి గారి భూమి, దక్షిణం : కాల్వ మరియు దిగువ 2వ అయిటం భూమి
DJ-Ir. విలువ : రూ.2,69,000
అమీనా విలువ : రూ.4,00,000
యస్.ఆర్.ఓ. విలువ : రూ.4,73,440
2) సర్వే నెం. 203/3 విస్తీరణం : 0-60 సెంట్లు
దిశలు : తూర్పు : నాగేశ్వర రెడ్డి గారి భూమి పడమర : బ్రహ్మేశ్వర రెడ్డి మరియు ఇతరుల భూమి, ఉత్తరం : కాల్వ మరియు పై 1వ అయిటం భూమి, దక్షిణం : బోయ మండ్ల రవీంద్ర గారి భూమి మరియు పులిమద్ది పొలిమేర
DJ-Ir. విలువ : రూ.60,000
అమీనా విలువ : రూ.1,50,000
యస్.ఆర్.ఓ. విలువ : రూ.1,05,440
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు) వాయిదా 06-02-2023

శ్రీ బి. హరి ప్రసాద్,
డి.హెచ్.ఆర్.పరం అడ్వకేట్, నంద్యాల

నేటి నుంచి బాలికా దినోత్సవ కార్యక్రమాలు

నంద్యాల(అర్బన్): జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు నంద్యాల జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టులలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 'ఆడ పిల్లలను రక్షించండి.. ఆడ పిల్లలను చదివించండి' అనే నినాదంతో వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నంద్యాల జిల్లా పీడీ లీలావతి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆమె మంగళవారం మాట్లాడుతూ.. మొదటి రోజు అంగన్‌వాడీ పరిధిలో ఉన్న గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించడం, అంగన్‌వాడీ పరిధిలోని సచివాలయాల్లో ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందన్నారు. 19న ప్రతి గ్రామ సభలో సీఎస్ఆర్ బాలిక నిష్పత్తి, బాలికలకు నైపుణ్యాభివృద్ధి, గృహ సందర్శన, కొత్తగా పెళ్లయిన జంటలకు ఆడ పిల్లల ప్రాముఖ్యత గురించి తెలియజేయడం, 20న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలకు పోస్టర్స్ అతికించడం, స్లోగన్స్ రాయడం, చిత్రలేఖన, ఆటల పోటీలు నిర్వహించడం, 23న గ్రామస్థాయిలో బాల్య వివాహాలపై కమ్యూనిటీ లీడర్స్‌కు అవగాహన కల్పించడం, ఆరోగ్యం, పోషకాహారం, గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలపై తెలియజేయడం, 24న అంగన్‌వాడీ సెంటర్ పరిధిలో గ్రామ సచివాలయాల్లో చెట్లు నాటించే కార్యక్రమంతో వారోత్సవాలు ముగుస్తాయన్నారు. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త వారోత్సవాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

20వ తేదీ వరకు బియ్యం పంపిణీ

నంద్యాల(అర్బన్): ఎండీయూ వాహనాల ద్వారా ఈనెల 20వ తేదీ వరకు పీడీఎస్ బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆచార్యులు తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బియ్యం పొందని కార్డుదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విజయ డెయిరీలో నేడు కోల్డ్ స్టోరేజ్ ప్రారంభం

నంద్యాల(అర్బన్): స్థానిక విజయ డెయిరీలో బుధవారం నూతన ఇంక్యూబేషన్, కోల్డ్ స్టోరేజీలు ప్రారంభం కానున్నాయని డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పాణ్యం, బనగానపల్లె, నంద్యాల ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని


మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రారెడ్డి

మిడుతూరు: గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధిహామీ పథకం కింద పనులు కల్పించి వలసలు నివారించాలని జిల్లా డ్వామా పీడీ రామచంద్రారెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలు వలసలు వెళ్లకుండా ఉపాధిహామీ సిబ్బంది పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పనులు ప్రారంభించని గ్రామాలలో త్వరగా చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశషచలరెడ్డి, ఏపీఓ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.